
సాక్షి
గుంటూరు

మంగళవారం । 16 । మే । 2023



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 521.70 అడుగుల వద్ద ఉంది. ఎస్‌ఎల్‌బీసీకి విడుదలవుతున్న నీటిని నిలిపివేశారు.



నిమ్మకాయల ధరలు

తెనాలిటౌన్: స్థానిక మార్కెట్ యార్డులో సోమవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.1700, గరిష్ట ధర రూ.3,200, మోడల్ ధర రూ.2,400 వరకు పలికింది.



ఇంద్రకీలాద్రిపై జస్టిస్ లలిత

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.లలిత దంపతులు ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను సోమవారం దర్శించుకున్నారు.

న్యూస్‌రీల్

నేటి నుంచి ఏపీఆర్‌జేసీ డీసీ సెట్ హాల్ టికెట్లు డౌన్‌లోడ్

గుంటూరు ఎడ్యుకేషన్: ఏపీ రెసిడెన్షియల్ జూనియర్, డిగ్రీ కళాశాలల్లో ప్రవేశానికై ఈనెల 20న జరగనున్న ఏపీఆర్‌జేసీ డీసీ సెట్ హాల్ టిక్కెట్లను మంగళవారం నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చునని సెట్ జిల్లా సమన్వయకర్త సీహెచ్ శిరీషా సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఏపీఆర్ఎస్.ఏపీసీఎఫ్ఎస్.ఇన్ సైట్ నుంచి హాల్ టిక్కెట్లను పొందాలని, ఇతర సమాచారానికి 98495 59611 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

24 నుంచి ఇంటర్ సప్లిమెంటరీ

గుంటూరు వెస్ట్: ఇంటర్మీడియెట్ పబ్లిక్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలను ఈ నెల 24 నుంచి వచ్చే నెల 1వ వరకు నిర్వహిస్తామని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి, డీఆర్వో చంద్రశేఖరరావుతో కలిసి నిర్వహించిన అధికారుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు అధిక మార్కులు రావాలని రాసే ఈ పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు చేయాలన్నారు. వేసవి తీవ్రంగా ఉన్న నేపథ్యంలో పరీక్ష కేంద్రాల్లో ఫ్యాన్లు, మంచినీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మజ్జిగ, మెడికల్ కిట్స్ అందుబాటులో ఉంచాలన్నారు. దీంతోపాటు పరీక్ష కేంద్రాల వద్ద పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని సూచించారు. అధికారులు సమన్వయంతో పని చేయాలని పేర్కొన్నారు. ఇంటర్మీడియేట్ ఆర్ఐఓ జి.సునీత మాట్లాడుతూ ఈ నెల 24 నుంచి వచ్చే నెల 1 వరకు జరగనున్న పరీక్షల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ద్వితీయ సంవత్సరం పరీక్షలు మధ్యాహ్నం 2.30 నుంచి 5.30 వరకు నిర్వహిస్తామన్నారు. జిల్లాలో మొత్తం 54 పరీక్ష కేంద్రాల్లో ఈ పరీక్షలు జరుగుతాయన్నారు. ప్రథమ సంవత్సరానికి 21,725, ద్వితీయ సంవత్సరానికి 6,424 మంది హాజరవుతున్నారని పేర్కొన్నారు.

'స్మృతివనం' పనుల పరిశీలన



పటమట(విజయవాడతూర్పు): విజయవాడ స్వరాజ్య మైదానంలో జరుగుతున్న అంబేడ్కర్ విగ్రహ నిర్మాణ పనులను రాష్ట్ర మున్సిపల్ శాఖ ప్రత్యేక కార్యదర్శి శ్రీలక్ష్మి, వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పరిశీలించారు. ఢిల్లీ నుంచి వచ్చిన డిజైనర్ల నుంచి వివరాలు తెలుసుకున్నారు. విగ్రహం, స్మృతివనం డిజైన్లను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ నిర్మాణంలో పొరపాట్లు జరగకుండా పనులు జరగాలని డిజైనర్లను ఆదేశించారు. నిర్దేశిత పనులు పూర్తి కావాలని, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించే ఈ ప్రాజెక్టులో లోటుపాట్లు లేకుండా నిరంతరం అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. ఈ పర్యటనలో క్వాలిటీ కంట్రోల్ అధికారులు, ఏపీఐఐసీ అధికారులు, కేసీపీ ప్రతినిధులు పాల్గొన్నారు.

మహిళల చదరంగం పోటీలకు ఏర్పాట్లు పూర్తి

విజయవాడ స్పోర్ట్స్: రాష్ట్రస్థాయి సీనియర్ మహిళల ఫిడే రేటింగ్ చెస్ చాంపియన్ షిప్–2023 నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు రోటరీ మిడ్‌టౌన్ విజయవాడ అధ్యక్షులు ఎం.కృష్ణప్రభు అన్నారు. పోటీల బ్రోచర్‌ను విజయవాడ గురునానక్‌కాలనీలోని గేట్స్ ఇన్‌స్టిట్యూట్‌లో సోమవారం ఆవిష్కరించారు. కృష్ణప్రభు మాట్లాడుతూ ఏపీ చెస్ అసోసియేషన్, జూనియర్స్ చెస్ అకాడమి, గేట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ సైన్సెస్, రోటరీ మిడ్ టౌన్ సంయుక్త ఆధ్వర్యాన ఈ నెల 18 నుంచి 21వ తేదీ వరకు గేట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ సైన్సెస్‌లో పోటీలు జరుగుతాయని వివరించారు. మొద టి నాలుగు స్థానాలు సాధించిన క్రీడాకారులు జూన్ 30 నుంచి జూలై 10వ తేదీ వరకు గుజరాత్‌లో జరిగే జాతీయ పోటీలకు రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహిస్తారని పేర్కొన్నా రు. ఈ పోటీలతో పాటు అండర్–7,9, 11,13,15 బాలికల చెస్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న క్రీడాకారిణులు ఈ నెల 16వ తేదీ లోపుగా డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏపీచెస్.ఓఆర్‌జీలో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. సమావేశంలో రోటరీ మిడ్ టౌన్ విజయవాడ కార్యదర్శి కె.ఎస్.ఎన్.బాబు, ఉపాధ్యక్షుడు బి.రామ్మోహన్‌రెడ్డి, 'గేట్స్' చైర్మన్ టి.కృష్ణబాబు, నగర చెస్ అసోసియేషన్ కార్యదర్శి ఎం.రాజీవ్, సహాయ కార్యదర్శి డాక్టర్ ఎల్.మనోజ్, టోరీ చైర్మన్ ఐ.ప్రదీప్ పాల్గొన్నారు.



మాటే మంత్రమై : తుబాడులో రోగి నాయుడు కోటయ్యను పరామర్శిస్తున్న మంత్రి రజని

జగనన్న లక్ష్యం 'ఆరోగ్యాంధ్రప్రదేశ్'

- పల్నాడు జిల్లా తుబాడు గ్రామంలో వైద్య ఆరోగ్య శాఖ మంత్రి రజిని సుడిగాలి పర్యటన
- ఫ్యామిలీ డాక్టర్ సేవలపై అడుగడుగునా ఆరా
- స్వయంగా రోగుల ఇళ్లకు వెళ్లి ఆరోగ్యంపై వాకబు

నాదెండ్ల: ఆరోగ్యాంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని చెప్పారు. పల్నాడు జిల్లా తూబాడు గ్రామంలో జరుగుతున్న ఫ్యామిలీ డాక్టర్ వైద్య విధానాన్ని సోమ వారం ఆమె స్వయంగా పరిశీలించారు. ప్రతిరోజూ పీహెచ్‌సీ పరిధిలో 250–270 వరకూ ఓపీ చూసి వారికి అవసరమైన మందులు ఉచితంగా అందిస్తున్నట్లు చెప్పారు. గ్రామంలో మంచానికే పరిమితమైన గొల్లపూడి గురవమ్మ, నాయుడు కోటయ్య, స్టీఫెన్‌పాల్, దావల మరియమ్మల ఇళ్లకు వెళ్లి స్వయంగా వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఫ్యామిలీ డాక్టర్ విధానంలో వారికి మరింత మెరుగైన వైద్య సేవలు అందించాలని స్థానిక వైద్యులను ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి చిన్నారుల రక్తహీనత పరీక్షలను స్వయంగా చేశారు. గ్రామానికి చెందిన ఐదేళ్ల చిన్నారి మరియదాసుకు రక్త పరీక్షలు నిర్వహించారు. ఈ వయస్సులో ఈ చిన్నారికి సుమారు 10 శాతం హిమోగ్లోబిన్ ఉండాల్సి ఉండగా 8.5 మాత్రమే ఉందని రిపోర్టులో తేలింది. దీనిపై స్థానిక వైద్యాధికారి సాయిశ్వేత మాట్లాడుతూ హిమోగ్లోబిన్ మెరుగుపడాల్సిన అవసరం ఉందని, తల్లిదండ్రులను పిలిచి చిన్నారికి ప్రతిరోజూ కోడిగుడ్లు, పాలు, పప్పు, ఆకుకూరల ఆహారం ఎక్కువగా తినిపించాలని కోరారు. అనంతరం జగనన్న సంపూర్ణ పోషణపై చర్చించారు. ఫ్యామిలీ వైద్య విధానం ద్వారా రాష్ట్రంలో ప్రతి ఒక్కరూ సంతోషంగా ఉన్నారని, ఇంటి ముందుకే వైద్యం అందుబాటులో రావటంతో పేద కుటుంబాల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. తమకు ఈ తరహా ప్రభుత్వ వైద్యం అందలేదని సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. ప్రభుత్వ వైద్యశాలల్లో అందుబాటులో లేని మందుల వివరాలు ఇస్తే వాటిని తెప్పించి అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటానని వైద్యులతో అన్నారు. రోగులకు అవసరమైన అన్ని మందులు ప్రభుత్వ వైద్యశాలల ద్వారా అందించాలన్నారు. విధానాన్ని మరింత మెరుగుపరచి ప్రజలకు నాణ్యమైన వైద్యాన్ని దరిచేర్చేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. పేదవాడి ఆరోగ్య రక్షణే ప్రభుత్వ సంకల్పమన్నారు. విద్య, వైద్య రంగాలకు ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతతో లక్షల కుటుంబాలకు మేలు జరుగుతుందన్నారు. అనంతరం గర్భిణులకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు అందించారు.

కార్యక్రమంలో సర్పంచ్ గోళ్లమూడి కాశయ్య, జెడ్పీటీసీ మస్తాన్‌రావు, ఎంపీపీ తలతోటి రాణి, వైద్య ఆరోగ్య శాఖ జేడీ రమేష్, జిల్లా ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ హనుమ కుమార్, డీఎంహెచ్‌వో శోభారాణి, స్థానిక వైద్యులు ప్రియాంక, సాయిశ్వేత, సీడీపీవో శాంతకుమారి, నాదెండ్ల, గణపవరం సొసైటీల అధ్యక్షులు కురుగుంట్ల వెంకటరెడ్డి, మంగు ఏడుకొండలు, నాయకులు మద్దూరి కోటిరెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.



'అవ్వ'స్థలన్నీ చెల్లు: తుబాడులో రోగి తేరీజమ్మ ఆరోగ్యం గురించి తెలుసుకుంటూ..



రజనీ.. సంజీవని : అంగన్‌వాడీ కేంద్రంలో ఓ చిన్నారికి రక్త పరీక్షలు



రేపటి తరానికి రక్ష : అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారుల ఆరోగ్యం గురించి వాకబు చేస్తూ



'బాలా'ర్యుడు కావాలని: అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారికి ఐరన్ పోలిక్ చుక్కలు వేస్తున్న మంత్రి

ప్రారంభమైన ఏపీ ఈఏపీ సెట్

- ఇంజినీరింగ్ స్ట్రీమ్ పరీక్షలకు హాజరైన విద్యార్థులు
- ఉమ్మడి గుంటూరు జిల్లాలో 18 కేంద్రాల్లో పరీక్షలు
- ఉదయం, మధ్యాహ్నం రెండు విడతలుగా కంప్యూటర్ బేస్డ్ టెస్టు



చల్లావారిపాలెంలో ఓ కేంద్రం వద్ద విద్యార్థులు

గుంటూరు ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల ఉమ్మడి ప్రవేశ పరీక్ష (ఏపీ ఈఏపీ సెట్–2023) సోమవారం ప్రారంభమైంది. రాష్ట్ర ఉన్నత విద్యామండలి విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం సోమవారం ఇంజినీరింగ్ స్ట్రీమ్‌లో మొదలైన ఆన్‌లైన్ కంప్యూటర్ బేస్డ్ పరీక్షలు ఈనెల 19వ తేదీ వరకు జరగనున్నాయి. ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా వివిధ ఇంజినీరింగ్ కళాశాలలు, విద్యాసంస్థల్లో ఏర్పాటు చేసిన 18 పరీక్ష కేంద్రాల్లో ఉదయం, మధ్యాహ్నం రెండు విడతల్లో జరిగిన పరీక్షలకు విద్యార్థులు హాజరయ్యారు. పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసిన పరీక్ష కేంద్రాల సిబ్బంది ఏపీ ఈఏపీ సెట్ హాల్ టిక్కెట్, ఐడీ కార్డు, పెన్సిల్ మినహా ఇతర ఎటువంటి వస్తువులను అనుమతించ లేదు. ఎండల తీవ్రత దృష్ట్యా ఉదయం 7.00 గంటలకే విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. ఆయా పరీక్షా కేంద్రాల పరిధిలో ప్రతీ సెషన్ ఆన్‌లైన్ పరీక్షకు 100 నుంచి 200 మంది విద్యార్థుల చొప్పున కేటాయించారు. 19 వరకు ఇంజినీరింగ్ స్ట్రీమ్ పరీక్షలు కొనసాగనుండగా, ఈనెల 22,23 తేదీల్లో అగ్రికల్చర్, ఫార్మసీ పరీక్షలు ప్రవేశ పరీక్షలు జరగనున్నాయి. ఎటువంటి అవాంతరాలు లేకుండా పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి.

ఎండ ప్రచండం



- భగ్గుమన్న భానుడు
- 46 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు
- రెంటచింతలలో అత్యధికంగా 48.6
- నిర్మానుష్యంగా రోడ్లు
- గుంటూరు, పొన్నూరు, బాపట్ల, సత్తెనపల్లి, నరసరావుపేటలలో 45కు పైనే!

సాక్షి ప్రతినిధి, గుంటూరు: భానుడు భగ్గుమంటున్నాడు. గత వారంలో అకాల వర్షాల వల్ల ఉష్ణోగ్రతలు తగ్గినా గత నాలుగు రోజుల నుంచి ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా పెరిగిపోయాయి. గుంటూరు నగరంలో సోమవారం అత్యధికంగా 46.00 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. పల్నాడు జిల్లా రెంటచింతలలో సోమవారం గరిష్ట ఉష్ణోగ్రత 48.6 డిగ్రీలు, కనిష్ట ఉష్ణోగ్రత 30.4 డిగ్రీలుగా నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. గుంటూరు జిల్లా పొన్నూరులో 45.9 డిగ్రీలు, నర్సరావుపేట మండలం రావిపాడు గ్రామంలో 45.8, బాపట్లలో 45.16, బాపట్ల జిల్లా చినగంజాంలో 45.7 డిగ్రీల సెలిసియస్ నమోదైంది. దీంతో ఒక్కసారిగా పెరిగిన ఉష్ణోగ్రతలతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఉదయం ఆరు గంటల నుంచే వేడిగాలులు ప్రారంభం అవుతున్నాయి. రాత్రి సమయంలో కూడా 30 డిగ్రీలకుపైనే ఉండటంతో ఉక్కపోత భరించలేకుండా ఉంది. దీంతో ఉదయం పది గంటల నుంచే రోడ్లు నిర్మానుష్యంగా మారుతున్నాయి. వ్యాపారాలు కూడా తగ్గిపోయాయి. ప్రజలు బయటకు రావడానికి భయపడుతున్నారు. రాత్రి 10 గంటలు దాటినా వడగాలులు తగ్గకపోవడంతో చిన్నపిల్లలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరో నాలుగురోజుల పాటు ఇదేస్థాయిలో ఉష్ణోగ్రతలు ఉంటాయని అధికారులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో అత్యవసరం అయితే తప్ప ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 4 గంటల వరకు బయట తిరగవద్దని వైద్యులు సూచిస్తున్నారు. బయటకు వస్తే టోపీ ధరించడంతో పాటు, చెవులకు రుమాలు కట్టుకోవాలని, శరీరం డీ హైడ్రేషన్‌కి గురికాకుండా తరచూ నీరు, గ్లూకోజ్ వాటర్, బార్లీ నీరు తాగుతుండాలని సూచిస్తున్నారు. వేసవి సందర్భంగా ఎండలు ఎక్కువ అవుతున్న నేపథ్యంలో ప్రజలకు వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, చలివేంద్రాలు ఏర్పాటు చేసి మజ్జిగ పంపిణీ చేయాలని జిల్లా అధికారులకు ఆదేశాలు జారీ అయ్యాయి. ఉష్ణోగ్రతలు బాగా పెరిగిపోవడంతో విద్యుత్ వినియోగం పెరిగింది. రోహిణికార్తె (25.5.23 నుంచి 08.06.23) వరకూ ఎండలు ఇదే విధంగా ఉండే అవకాశం ఉంది. దీంతో ఏసీలు, ఫ్యాన్లు, కూలర్లు, ఫ్రిజ్లు వంటి వాడకం పెరగడం వల్ల రానున్న పదిరోజులు విద్యుత్ డిమాండ్ పీక్‌స్టేజీకి వెళ్తుందని ట్రాన్స్‌కో అధికారులు భావిస్తున్నారు.



ప్రతిష్టాత్మకం 'జగనన్నకు చెబుదాం'



సమస్యలు ఆలకిస్తున్న కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి, వేదికపై జేసీ రాజకుమారి

యంత్రాంగానికి కలెక్టర్ దిశానిర్దేశం

గుంటూరు వెస్ట్: స్పందనతో ఎన్నో ప్రజా సమస్యలను పరిష్కరిస్తున్న మనం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమాన్ని అంతకంటే ఎక్కువ శ్రద్ధతో నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ గతంతో పోల్చుకుంటే స్పందన అర్జీల పరిష్కారం వేగంగా జరుగుతోందన్నారు. అక్కడక్కడా కొంత మంది సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా స్వల్ప ఆలస్యం అవుతోందని వివరించారు. వీటిని త్వరగా పరిష్కరించాలన్నారు. దీంతోపాటు జగనన్నకు చెబుదాం కార్యక్రమం ద్వారా 1902 వచ్చే ఫిర్యాదులు ప్రతీది క్రమపద్ధతిలో భద్రపరచడం, పరిష్కారమైతే వెంటనే ఫిర్యాదుదారునికి చెప్పడం చేయాలన్నారు. పరిష్కార సమయంలో ఇబ్బందులు ఎదురైతే జిల్లా అధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు. అనంతరం వచ్చిన 132 అర్జీలను జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి, డీఆర్వో చంద్రశేఖర రావు, జిల్లా అధికారులతో కలిసి పరిశీలించారు. సోమవారం వచ్చిన కొన్ని ఫిర్యాదులు ఇలా ఉన్నాయి..

కేటాయించిన భూమి ఇప్పించరూ...

అంకిరెడ్డి పాలెంలో బీసీ సంక్షేమ శాఖ ప్రధాన కార్యాలయ నిర్మాణం కోసం ఎకరా 40 సెంట్లు భూమిని కేటాయిస్తూ గతంలో జీఓ జారీ చేశారు. ఇప్పటి వరకు స్థలం చూపించ లేదు. రాష్ట్ర వ్యాప్తంగా అసంఖ్యాకంగా ఉన్న బీసీల అభివృద్ధికి కృషి చేసే మాకు కనీసం భవనం కూడా లేకపోవడం శోచనీయం. దయచేసి సదరు స్థలాన్ని కేటాయించాలి.

–కేశన శంకరరావు, కుమ్మరి క్రాంతి కుమార్, రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం నాయకులు

ప్రభుత్వాధికారే స్థలాన్ని కబ్జా చేశాడు!



నాకు గుంటూరు రూరల్ పరిధిలో 132 చ.గ. ఇంటి స్థలం ఉంది. దీనికి సంబంధించిన పూర్తి దస్తావేజులు, ఆధారాలు ఉన్నాయి. ఇక్కడే ఎంపీడీఓ కార్యాలయంలో పనిచేస్తున్న ఓ అధికారి నా స్థలాన్ని కబ్జా చేసి నన్నే బెదిరిస్తున్నారు. చివరకు పోలీసులను కూడా ఆశ్రయించా. అయినా ప్రయోజనం లేదు. నాకు న్యాయం చేయండి.

–పి.వెంకట కృష్ణ, గుంటూరు.

'బీపీ' లేకుంటే హ్యాపీ

- అధిక రక్తపోటుతో అనర్థాలు
- జాగ్రత్తలు తీసుకుంటే నియంత్రించ వచ్చు
- నేడు వరల్డ్ హైపర్ టెన్షన్ డే



గుంటూరు మెడికల్: ఆధునిక జీవన శైలి వల్ల రక్తపోటు (బీపీ) వ్యాధి బారిన పడుతున్న వారి సంఖ్య రోజురోజుకు పెరిగిపోతోంది. చాలా మందికి బీపీ ఉందన్న విషయం తెలుసుకునేలోపే ఆ వ్యాధి వల్ల కలిగే అనర్థాలతో శరీరంలోని పలు అవయవాలు దెబ్బతింటున్నాయి. బీపీ 120/80 ఉంటే సాధారణ బీపీగా లెక్కిస్తారు. చిన్న వయస్సులోనే బీపీ బారిన పడుతున్నవారి సంఖ్య ప్రపంచ వ్యాప్తంగా నానాటికి పెరిగిపోతుండటంతో వరల్డ్ హైపర్‌టెన్షన్ లీగ్ (డబ్ల్యూహెచ్‌ఎల్) సంస్థ 2005 నుంచి ప్రతి సంవత్సరం అధికరక్తపోటు పై (హైపర్ టెన్షన్) అవగాహన కలిగించేందుకు మే 17న వరల్డ్ హైపర్ టెన్షన్ డే నిర్వహిస్తోంది. ఈఏడాది మెజర్ యువర్ బ్లడ్ ప్రజర్ యాక్యూరేట్లీ, కంట్రోల్ ఇట్, లివ్ లాంగర్ అనే నినాదంతో వరల్డ్ హైపర్ టెన్షన్ డే నిర్వహిస్తున్నారు.

సైలెంట్ కిల్లర్

శరీరంలో రక్తాన్ని అన్ని రక్తనాళాలకు గుండె ఒత్తిడి చేసి (ప్రజర్) పంపిస్తోంది. అధిక వేగంతో రక్తాన్ని ప్రసరింప చేసే శక్తినే బ్లడ్ ప్రజర్‌గా పేర్కొంటారు. అధిక రక్తపోటును సైలెంట్ కిల్లర్‌గా పిలుస్తారని వైద్యులు తెలిపారు. చాలా మందికి రక్తపోటు లక్షణాలు ఉన్నట్లు కూడా తెలియకపోవడం వల్ల ఉన్నట్టుండి గుండెపోటు వచ్చి కుప్పకూలి పోతారు. తలనొప్పి, అలసట అనిపిస్తే ఏమాత్రం నిర్లక్ష్యం చేయకుండా తక్షణమే వైద్యులను సంప్రదించి బీపీ చెకప్ చేయించుకోవాలి.

కారణాలు

అధిక రక్తపోటు సాధారణంగా వయస్సు మళ్లిన వారికి వస్తుంది. జన్యుపరమైన కారణాలతో కూడా వస్తుంది. ధూమపానం, మద్యపానం, ఊబకాయం, ఏమి పనిచేయకుండా ఒకేచోట గంటల తరబడి ఉండటం, హైపోథెరాయిడ్, ఒత్తిడి, అనారోగ్యకరమైన ఆహారపు అలవాట్లతో, కంటికి సరిపడ నిద్ర లేకపోవడం, శారీరకశ్రమ లేకపోవడం, దీర్ఘకాలిక మూత్ర పిండాల జబ్బు ద్వారా బీపీ వస్తుంది.

ఎక్కువ మంది దీని బాధితులే

జనరల్ ఫిజీషియన్, కార్డియాలజిస్టు, నెఫ్రాలజిస్టు వైద్యుల వద్దకు చికిత్స కోసం వెళ్లేవారిలో ఎక్కువ శాతం మంది అధిక రక్తపోటు బాధితులే. జిల్లాలో 50 మంది జనరల్ ఫిజిషియన్లు, 30 మంది కార్డియాలజిస్టులు, 20 మంది నెఫ్రాలజిస్టులు చికిత్స అందిస్తున్నారు. వీరి వద్దకు చికిత్సకు వెళ్లే రోగుల్లో 20 నుంచి 30 శాతం మంది అధిక రక్తపోటు బాధితులే. ప్రభుత్వం ఎన్‌సీడీ కార్యక్రమం ద్వారా జిల్లావ్యాప్తంగా ఇంటింటికీ వైద్య సిబ్బంది ద్వారా పరీక్షలు చేయించి బీపీ బాధితులను గుర్తించి చికిత్స అందిస్తుంది. జిల్లాలో 1,20,738 మంది అధిక రక్తపోటు బాధితులు ఉన్నట్లు జిల్లావైద్య అధికారులు నిర్ధారించి వారికి స్థానికంగా ఉన్న ఆరోగ్య కేంద్రాల్లోనే ఉచితంగా మందులు అందిస్తున్నారు.

ఉచితంగా ప్రభుత్వ వైద్య సేవలు

గత ప్రభుత్వాల్లో ఎన్నడూ లేనివిధంగా ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా బాధ్యతలు చేపట్టగానే ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల బలోపేతంపై దృష్టి సారించి గ్రామీణ ప్రాంతాల్లోనే బీపీ, షుగర్ లాంటి దీర్ఘకాలిక వ్యాధులకు స్పెషాలిటీ వైద్య సేవలు అందిస్తున్నారు. జనరల్ ఫిజిషియన్లను ప్రభుత్వం ప్రత్యేకంగా నియమించి ఆరోగ్య కేంద్రాల్లో ఉచితంగా వైద్య పరీక్షలు చేయించడంతో పాటు, మందులు కూడా అందజేస్తుంది.

ముందస్తు జాగ్రత్తలే ముఖ్యం



ఆధునిక జీవనశైలి వల్లవయస్సుతో సంబంధం లేకుండా అధిక రక్తపోటు బారిన పడుతున్నవారి సంఖ్య రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ వ్యాధిపై అవగాహన కలిగి ఉండి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి. ఆహారంలో ఐదు గ్రాములకు మించి ఉప్పు తీసుకోకూడదు.

– డాక్టర్ రేవూరి హరికృష్ణ, సీనియర్ జనరల్ ఫిజీషియన్, గుంటూరు

బీపీతో గుండెకు చేటు



అధిక రక్తపోటు గుండెకు చేటు. గుండెసమస్య చికిత్స కోసం వచ్చేవారిలో 30 శాతం మంది బీపీ వల్ల గుండెపోటుకు గురైన వారే. అధికరక్తపోటుతో బ్రెయిన్ స్ట్రోక్‌కూడా వచ్చే ప్రమాదం ఉంది. కంటి సంబంధిత సమస్యలు కూడాఉత్పన్నమవుతాయి. ప్రతిఒక్కరూ బీపీపై అవగాహన కలిగిఉండి ముందస్తుజాగ్రత్తలు తీసుకోవడం ద్వారా వ్యాధి బారిన పడకుండా కాపాడుకోవచ్చు.

–డాక్టర్ ఉప్పుటూరి అంజిత్, ఇంట్రవెన్షనల్ కార్డియాలజిస్టు, గుంటూరు

గుంటూరు ఎంఈఓగా బలిరాం

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరు తూర్పు, పశ్చిమ మండలాల విద్యాశాఖాధికారిగా పెదకాకాని ఎంఈఓ డి.బలిరాంకు పూర్తి అదనపు బాధ్యతలు (ఎఫ్ఏసీ) అప్పగిస్తూ ఆర్జేడీ వీఎస్ సుబ్బారావు సోమవారం ఉత్తర్వులు విడుదల చేశారు.

గుంటూరు ఎస్‌బీ డీఎస్పీగా సుభాష్ బాధ్యతల స్వీకారం


ఎస్‌బీ డీఎస్పీ సుభాష్

నగరంపాలెం(గుంటూరు): గుంటూరు స్పెషల్ బ్రాంచి (ఎస్‌బీ) కొత్త డీఎస్పీ ఎ.సుభాష్ సోమవారం కలెక్టర్ బంగ్లా రోడ్‌లోని ఎస్‌బీ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన బదిలీల్లో ఆయన గుంటూరు ఎస్‌బీకి బదిలీ అయిన విషయం విదితమే. ఆయన 2019 గ్రూప్–1 అధికారి. గతంలో పార్వతీపురం డీఎస్పీగా విధులు నిర్వర్తించారు. డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన ఆయన జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్‌హఫీజ్, పలువురు పోలీస్ ఉన్నతాధికారులను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

నీటి కుంటలో పడి విద్యార్థి మృతి

రాజుపాలెం: విద్యార్థి ఈతకు వెళ్లి ప్రమాదవశాత్తు నీటి కుంటలో పడి మృతి చెందిన ఘటన మండలంలోని కొండమోడు సమీపంలోని మామిడి తోటలో సోమవారం చోటుచేసుకుంది. వివరాలు.. కొండమోడు గ్రామానికి చెందిన ఎస్‌కే షరీఫ్(12) ఒక ప్రైవేటు పాఠశాలలో 7వ తరగతి చదువుతున్నాడు. వేసవి సెలవులు కావడంతో సరదాగా శ్రీ సాయిబాలాజీ నర్సరీ వారు ఏర్పాటు చేసిన కృత్రిమ నీటికుంటలో ఈతకు వెళ్లి కుంటలో పడి మృతి చెందాడు. నీటి కుంట ఎక్కువ లోతు ఉండడంతో మృతి చెందాడు.

బాధితుల పక్షాన నిలబడదాం

పోలీస్ స్పందనలో ఏఎస్పీ సుప్రజ


బాధితుల సమస్య ఆలకిస్తున్న జిల్లా ఏఎస్పీ సుప్రజ, పక్కన డీఎస్పీ శ్రీనివాసరావు

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలోని స్పందన హాలులో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక-స్పందన (గ్రీవెన్స్) జరిగింది. ఫిర్యాదులను ఏఎస్పీ (పరిపాలన) కె.సుప్రజ స్వీకరించారు. బాధితుల సమస్యలపై పోలీస్ అధికారులతో ఏఎస్పీ జూమ్ ద్వారా మాట్లాడారు. త్వరగా అర్జీలను పరిష్కరించాలని ఆదేశించారు. చట్ట పరిధిలో న్యాయం చేయాలని సూచించారు. పోలీస్ స్టేషన్లకు వచ్చే అర్జీదారుల పట్ల మర్యాదగా మెలగాలని, బాధితుల పక్షాన నిలబడదామని చెప్పారు. ఏ ఒక్కరితోనూ నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దని ఆదేశించారు. డీసీఆర్‌బీ డీఎస్పీ శ్రీనివాసరావు కూడా అర్జీలు స్వీకరించారు.

కత్తెరతో దాడి

ఇటీవల కుటుంబ విషయమై భార్యతో చిన్న గొడవ జరిగింది. ఇది భార్య తరుపు కుటుంబ సభ్యులకు తెలిసింది. ఈనెల 11న కొళాయి వద్ద నీరు పడుతుండగా తెలిసిన వ్యక్తులు కత్తెరతో దాడికి యత్నించారు. దీంతో ప్రాణ భయంతో అక్కడి నుంచి పారిపోయా. అనంతరం ఇంట్లో ఉన్న అమ్మ షేక్ గౌసియాబీపై కూడా దాడికి ఒడిగట్టారు. అనంతరం ఇద్దరం జీజీహెచ్‌లో చికిత్స పొందాం. దీనిపై స్థానిక పోలీసులకు ఫిర్యాదిచ్చినా ఫలితంలేదు. న్యాయం చేయగలరు.

– షేక్.నాగూర్‌సైదా, ప్రగతినగర్, సుద్దపల్లిడొంక

భర్త ఆచూకీ గుర్తించగలరు

రెండేళ్ల క్రితం ప్రేమ పెళ్లి చేసుకున్నాం. ఒక పాప ఉంది. భర్త ఓ ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీలో కలెక్షన్ ఏజెంట్. ఇరవై రోజుల క్రితం భర్త ఇంటి నుంచి వెళ్లిపోయాడు. అప్పటి నుంచి అప్పులు ఇచ్చిన వారు ఇంటి వద్దకు వచ్చి నానాయాగీ సృష్టిస్తున్నారు. భర్త ఆచూకీని గుర్తించగలరు.

– ఓ మహిళ, వట్టిచెరుకూరు మండలం

సామగ్రి తస్కరించారు

విద్యానగర్‌లో ఇల్లు నిర్మించుకునేందుకు గృహ సామగ్రిని కొనుగోలు చేసి నిల్వచేశాను. ఎవరూ లేని సమయంలో సామగ్రి తస్కరించారు. వాచ్‌మెన్‌ను అడగ్గా, కూలి పనులు చేసేందుకు వచ్చిన ఓ వ్యక్తి వాహనంలో తరలించినట్లు తెలిసింది. దీనిపై ఈనెలలో స్పందనలో ఫిర్యాదు చేశాను. పోలీసులకు ఫిర్యాదు చేశానని తెలిసి కొందరు వ్యక్తులు ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ఆ వ్యక్తిని విచారించి, మెటీరియల్‌ను ఇప్పించాలి.

– పి.నాగశైలజ, విద్యానగర్

డబ్బులు, నగదుతో ఉడాయించాడు

గతనెల 19న బస్టాండ్ వద్ద ఆటో ఎక్కాను. బంగారం మెరుగుపట్టే దుకాణాల వద్దకు తీసుకెళ్లాలని డ్రైవర్ని అడిగాను. అతను ఏటుకూర్‌రోడ్ వైపు వెళ్తుండగా నిలువరించాను. దీంతో డ్రైవర్ ఆటోను వదిలి, నా వద్దనున్న పర్సుతో ఉడాయించాడు. అందులో రూ.21 వేలు, బంగారు గొలుసు, రెండు ఉంగరాలు ఉన్నాయి. డబ్బులు, నగలు ఇప్పించండి.

– సంగీత, నంబూరు, పెదకాకాని మండలం

పీటీజీ పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

విజయపురిసౌత్: స్థానిక పీటీజీ గురుకుల బాలుర పాఠశాలలో ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ కె.శ్రీను నాయక్ సోమవారం కోరారు. మూడో తరగతిలో ప్రవేశాల కోసం పీటీజీ చెంచు విద్యార్థులకు 58, కొండసవర 2, ఎస్సీ 1, బీసీ 1, ఓసీ 1 ఆయా ఏరియాలలో ఉన్నటువంటి ఆదిమ గిరిజన తెగలకు చెందిన వారికి 15, ఏజెన్సీ కోటలో 1 మొత్తం 80 ఖాళీలు ఉన్నాయన్నారు. బ్యాక్‌లాగ్ ఖాళీలలో 4వ తరగతిలో 43, 5వ తరగతిలో 37, 6వ తరగతిలో 52, 7వ తరగతిలో 18, 8వ తరగతిలో 6, 9వ తరగతిలో 30 మొత్తం 186 ఖాళీలు పీటీజీ చెంచు విద్యార్థులతో భర్తీ చేయనున్నట్లు చెప్పారు. పూర్తి చేసిన దరఖాస్తులను విజయపురిసౌత్‌లోని పీటీజీ పాఠశాలలో అందజేయాలన్నారు.

పోస్ట్ ప్రొడక్షన్ పనులకు సినీ స్టూడియో ఉచితం

మా ఏపీ వ్యవస్థాపకుడు దిలీప్‌రాజా



తెనాలి: రాష్ట్రంలోని వివిధ లోకేషన్లలో సినిమాలు తీసే నిర్మాణ సంస్థలకు ప్రభుత్వం ఉచితంగానే అనుమతులు ఇస్తున్నందున, తెనాలి రెవెన్యూ డివిజన్ పరిధిలో సినిమాలు చిత్రీకరించే సంస్థలకు పోస్ట్ ప్రొడక్షన్ పనులకు తన స్టూడియోను ఉచితంగా ఇస్తానని మా ఏపీ వ్యవస్థాపకుడు దిలీప్‌రాజా వెల్లడించారు. పెదరావూరులోని ఫిలిం స్టూడియోలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. సినిమా చిత్రీకరణ అనంతరం డబ్బింగ్, ఎడిటింగ్‌కు సంబంధిత నిర్మాతలు తన స్టూడియోను వినియోగించుకోవచ్చని, సౌండ్ ఇంజినీరు, ఎడిటర్‌ను ఆయా నిర్మాణ సంస్థలే తెచ్చుకోవాలని సూచించారు. భారత ప్రభుత్వ సమాచార ప్రసార శాఖ నుంచి తమ సంస్థకు అనుమతి ఉన్నందున, ఎడిటింగ్, డబ్బింగ్, రీ–రికార్డింగ్, డీఏ, 501, సీజీలతో పూర్తయిన సినిమాలను మా ఏపీ ద్వారా సెన్సార్‌కు పంపించే అవకాశం ఉందన్నారు. సెన్సార్‌కు అవసరమైన లేబ్ లెటర్, నిడివి, ధ్రువీకరణ పత్రాలనూ ఉచితంగా అందజేస్తామని కూడా చెప్పారు. ఆంధ్రలో సినిమాల చిత్రీకరణ పెరగాలనే భావనతో ఈ నిర్ణయం తీసుకున్నట్టు వివరించారు.

ఉత్తమ నాటికగా 'లక్ష్మణ రేఖ దాటితే!'

- ఉత్తమ నటుడు ఎస్.ఎం.బాషా
- ఉత్తమ నటి లహరి (ఆస్తికలు)


ఉత్తమ ప్రదర్శన లక్ష్మణ రేఖ దాటితే! లోని ఓ సన్నివేశం

నరసరావుపేట ఈస్ట్: నరసరావుపేట రంగస్థలి ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించిన ఆహ్వాన నాటిక పోటీలు ముగిశాయి. పోటీల విజేతలకు ఆదివారం రాత్రి బహుమతులు అందజేశారు. ఉత్తమ ప్రదర్శనగా హైదరాబాద్ మిత్ర క్రియేషన్స్ వారి లక్ష్మణ రేఖ దాటితే! నిలిచింది. ఈ నాటికలో విశ్వనాథం పాత్రధారి ఎస్.ఎం.బాషాకు ఉత్తమ నటుడు, ఉత్తమ సంగీతం (లీలామోహన్) బహుమతులు లభించాయి. అలాగే ద్వితీయ ఉత్తమ ప్రదర్శనగా పెదకాకాని గంగోత్రి వారి ఆస్తికలు నాటిక ఎంపిక కాగా, దీనిలో జయమ్మ పాత్రధారి గుడివాడ లహరి, ఉత్తమ నటి బహుమతి గెలుచుకుంది. ఆస్తికలు నాటిక ఉత్తమ ఆహార్యం(పరమేష్), ఉత్తమ రచన(పిన్నమనేని మృత్యుంజయరావు) బహుమతులు లభించాయి. తెనాలి కళల కాణాచి కళాకారులు ప్రదర్శించిన అంధ స్వరం తృతీయ ఉత్తమ ప్రదర్శనగా నిలవటంతో పాటు ఉత్తమ బాలనటులు(ఆరాధ్య, గీతాంజలి, లోహిత్, జోయల్), ఉత్తమ క్యారక్టర్ నటి(దివ్య చౌదరి), ఉత్తమ రంగాలంకరణ(ఫణీంద్ర) బహుమతులు అందుకున్నారు. కాగా, ఉత్తమ ప్రతి నాయకురాలుగా విశాఖపట్నం తెలుగు కళాసమితి వారి నిశ్శబ్దమా! నీఖరీదెంత? నాటికలో పల్లవి పాత్రధారిణి హేమ, ఉత్తమ క్యారెక్టర్ నటునిగా కుమార్ పాత్రధారి వరప్రసాద్ ఎంపికయ్యారు. ఈ నాటిక దర్శకుడు చలసాని కృష్ణప్రసాద్ ఉత్తమ దర్శకుని బహుమతి అందుకున్నారు. ప్రత్యేక జ్యూరీ నటులుగా కొల్లా రాధకృష్ణ(రైతే రాజు), గిరిబాబు(చీకటి పువ్వు), సునయన (సాహితీ సూక్తం), జ్యోతి (ఓ క్రైమ్ కథ) బహుమతులు అందుకున్నారు.

హజ్ యాత్రికులకు సాయంపై హర్షం


ఎస్. ఎం. జియావుద్దీన్

లక్ష్మీపురం(గుంటూరు): రాష్ట్రంలో హజ్ యాత్రికులకు ప్రత్యేక ఆర్థిక సాయం రూ.14.51 కోట్లు విడుదల చేస్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి జీవో జారీ చేయడంపై రాష్ట్రవ్యాప్తంగా ముస్లిం మైనార్టీలు హర్షం వ్యక్తం చేస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ మైనార్టీ వ్యవహారాల సలహాదారు ఎస్.ఎం.జియావుద్దీన్ చెప్పారు. బీఆర్ స్టేడియం వద్ద ఆయన కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రూ.80 వేల చొప్పున 1,813 మంది యాత్రికులపై పడిన పెను భారాన్ని రాష్ట్ర ప్రభుత్వం భరించడం ముస్లింలకు, ప్రధానంగా హజ్ యాత్రికులకు ఊరటనిచ్చిందన్నారు. హైదరాబాద్, బెంగళూరు ఎంబార్‌కేషన్ పాయింట్ టిక్కెట్ ధరలతో సమానంగా విజయవాడ ఎంబార్‌కేషన్ టిక్కెట్ ధరలను రాష్ట్ర ప్రభుత్వం ఖరారు చేసినట్లు వెల్లడించారు. సీఎం జగన్‌కు వ్యక్తిగతంగా, ముస్లిం సమాజం తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నట్లు వెల్లడించారు.

భవనం పైనుంచి పడి వైఎస్సార్ సీపీ నాయకుడి మృతి


భీమిరెడ్డి సాంబిరెడ్డి (ఫైల్)

తాడేపల్లిరూరల్: వైఎస్సార్ సీపీ నూతక్కి అధ్యక్షులు భీమిరెడ్డి సాంబిరెడ్డి (64) భవనంపై నుంచి ప్రమాదవశాత్తు జారిపడి మరణించారు. సాంబిరెడ్డి నూతక్కిలో చింతలబడి వద్ద మూడంతస్తుల భవనాన్ని నిర్మిస్తున్నారు. ఆ భవనానికి ఉదయం వాటరింగ్ చేస్తుండగా జారి కింద పిట్టగోడపై పడడంతో అక్కడికక్కడే మృతి చెందారు. భీమిరెడ్డి సాంబిరెడ్డికి భార్యతోపాటు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఒక కుమార్తె నూతక్కిలో ఉంటుండగా, మరో కుమార్తె అమెరికాలో ఉంటోంది. అమెరికాలో ఉన్న కుమార్తె దగ్గరకు భార్య ఈ మధ్యకాలంలో వెళ్లింది. భీమిరెడ్డి సాంబిరెడ్డి మృతి చెందిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఆర్కే స్థానికంగా ఉన్న నాయకులకు ఫోన్‌చేసి వివరాలు అడిగి తెలుసుకుని, ఆయన మృతికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అమెరికా నుంచి భార్యాపిల్లలు రాగానే అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు నూతక్కి వైఎస్సార్ సీపీ నాయకులు తెలిపారు.

డెంగీపై అప్రమత్తంగా ఉండాలి

కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి


వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, జేసీ రాజకుమారి

గుంటూరు వెస్ట్: డెంగీపై ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో డెంగీపై అవగాహన వాల్‌పోస్టర్లను జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి, అధికారులతో కలిసి కలెక్టర్ ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ మంగళవారం జాతీయ డెంగీ దినాన్ని నిర్వహించాలని సూచించారు. ఫ్రైడే డ్రై డే కార్యక్రమాన్ని పటిష్టంగా అమలు చేయాలన్నారు. రానున్న వర్షాకాలంలో అంటువ్యాధులు ప్రబలకుండా ముందస్తు ప్రణాళిక రచించాలని చెప్పారు. సమావేశంలో జిల్లా మలేరియా అధికారి డాక్టర్ సుబ్బరాయుణం, డీఆర్వో చంద్రశేఖరరావు, అధికారులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిదీ

పర్యావరణాన్ని కాపాడుకుంటే అది మనల్ని, మన భవిష్యత్తును కాపాడుతుందని కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి, డీఆర్వో చంద్రశేఖరరావుతో కలిసి మిషన్ లైఫ్ అవగాహనా కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ సౌర విద్యుత్‌ను ప్రోత్సహించడం, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకం, చెట్లు నాటడం లాంటి కార్యక్రమాలను ప్రోత్సహించాలన్నారు.

డాక్టర్ అనిరుద్‌కు ఐఎన్ఐ సెట్‌లో రెండో ర్యాంకు


అనిరుద్‌కు అభినందనలు తెలియజేస్తున్న వూటుకూరి సురేష్, నీలిమ, వైద్య సిబ్బంది

గుంటూరు మెడికల్: ఇనిస్టిట్యూట్ ఆఫ్ నేషనల్ ఇంపార్టెన్స్ కంబైన్డ్ ఎంట్రన్స్ టెస్ట్ (ఐఎన్ఐ–సెట్ 2023) జాతీయ స్థాయి పీజీ ప్రవేశ పరీక్ష ఫలితాల్లో గుంటూరుకు చెందిన డాక్టర్ వూటుకూరి వెంకట అనిరుద్ జాతీయ స్థాయిలో ద్వితీయ స్థానం సంపాదించారు. ఢిల్లీ ఎయిమ్స్‌లో 2017 నుంచి 2023 జనవరి వరకు ఎంబీబీఎస్ అభ్యసించిన డాక్టర్ అనిరుద్ ఐఎన్ఐ సెట్ రాసిన తొలి యత్నంలోనే జాతీయ స్థాయిలో రెండో ర్యాంకు సాధించారు. తన తల్లిదండ్రులు డాక్టర్ వూటుకూరి సురేష్, డాక్టర్ నీలిమ ఇద్దరూ వైద్యులు కావడంతో పీజీ ప్రవేశ పరీక్షా ఫలితాల్లో తనకు మెలకువలు నేర్పించారని పేర్కొన్నారు. రోజూ ఇంటివద్ద ఎనిమిది నుంచి పది గంటలపాటు చదివానని, ఆన్‌లైన్‌లో కోచింగ్ తీసుకుని తొలి యత్నంలోనే రెండో ర్యాంకు సాధించినట్లు వెల్లడించారు. తన తండ్రి చదివిన ఢిల్లీ ఏయిమ్స్‌లోనే ఎంబీబీఎస్ చదివానని, పీజీ జనరల్ మెడిసిన్ అభ్యసించి అనంతరం కార్డియాలజిస్ట్‌గా లేదా, న్యూరాలజిస్టుగా సేవలందించడమే తన లక్ష్యమని పేర్కొన్నారు. గుంటూరుకు చెందిన సీనియర్ గ్యాస్ట్రోఎంట్రాలజిస్ట్ డాక్టర్ వూటుకూరి సురేష్‌కుమార్ తనయుడు డాక్టర్ అనిరుద్ జాతీయస్థాయిలో ద్వితీయ స్థానం సాధించడంతో గుంటూరుకు చెందిన పలువురు వైద్యులు డాక్టర్ అనిరుద్‌కు అభినందనలు తెలిపారు. గుంటూరు కొత్తపేట అన్నా శ్రీనివాసరావు కల్యాణమండపం రోడ్డులోని వూటుకూరి హాస్పిటల్‌లో సోమవారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో పలువురు వైద్యులు, వైద్య సిబ్బంది డాక్టర్ అనిరుద్‌కు, అతని తల్లిదండ్రులకు అభినందనలు తెలియజేసి సన్మానించారు.

భారత జట్టు క్రీడాకారుడికి 'డబుల్ హార్స్' అభినందన


మధుబాబును సత్కరిస్తున్న శ్యాంప్రసాద్

తెనాలి: పట్టణ చెంచుపేటలోని అన్నాబత్తుని సత్యనారాయణ క్రీడా స్టేడియంలో నడుస్తున్న హ్యాండ్ బాల్ అకాడమీ క్రీడాకారుడు జె.మధుబాబును స్పాన్సర్ అయిన తెనాలి డబుల్ హార్స్ మినపగుళ్ల అధినేత మునగాల మోహన్ శ్యాంప్రసాద్ అభినందించారు. ఇటీవల భారత హ్యాండ్‌బాల్ జట్టుకు ఎంపికైన మధుబాబు, బల్గేరియాలో జరిగిన మెన్స్ ఇంటర్నేషనల్ హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్‌లో ఆడిన విషయం తెలిసిందే. ఆ పోటీల్లో భారత జట్టు సెమీ ఫైనల్స్‌కు చేరుకుంది. భారత్, బల్గేరియాల మధ్య జరిగిన ఆ పోటీ టైగా ముగియటంతో రెండు జట్లకు తృతీయ స్థానం ప్రకటించారు. గోల్ కీపర్‌గా మధుబాబు ఆయా మ్యాచ్‌ల్లో అత్యున్నతమైన ప్రదర్శన ఇచ్చాడు. పోటీల అనంతరం స్వదేశానికి వచ్చిన మధుబాబు, కోచ్ నాగరాజుతో కలసి సోమవారం సాయంత్రం అకాడమీ స్పాన్సర్ మునగాల మోహన్ శ్యాంప్రసాద్‌ను కలిశారు. శాలువాతో సత్కరించిన ఆయన శ్యాంప్రసాద్, భవిష్యత్‌లో మరెన్నో విజయాలను అందుకోవాలని ఆకాంక్షించారు. వీరితో సంస్థ జనరల్ మేనేజరు కృష్ణప్రసాద్ ఉన్నారు.

హత్యకు గురైన మహిళ గుర్తింపు

ఎస్ఆర్‌కేటీ కాలనీకి చెందిన సల్మాగా గుర్తింపు

నరసరావుపేట టౌన్: సైకో కిల్లర్ చేతిలో హత్యకు గురైన మహిళ ఎస్ఆర్‌కేటీ కాలనీకి చెందిన షేక్ సల్మా(38) గా వన్‌టౌన్ పోలీసులు గుర్తించారు. ఈ నెల 5వ తేదీన కూరగాయల మార్కెట్ సెంటర్ సమీపంలోని సాంబశివ ఫర్నిచర్స్ దుకాణం ఎదుట నిద్రిస్తున్న మహిళను తన్నీరు అంకమ్మరావు ఉరఫ్ ముళ్లపంది బండరాయితో మోది హతమార్చాడు. అనంతరం ఆమె వద్ద ఉన్న నగదు తీసుకొని పరారీ అయ్యాడు. కేసు నమోదు చేసిన వన్‌టౌన్ పోలీసులు గుర్తుతెలియని మహిళ మృతదేహం ఆనవాళ్ళ గురించి ఆరా తీశారు. నరసరావుపేట రూరల్ పరిధిలోని ఎస్ఆర్‌కేటీ కాలనీ 6వ లైన్‌కు చెందిన సల్మాగా మృతురాలిని గుర్తించారు. సోమవారం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌కు వచ్చిన కుటుంబ సభ్యులు ఆమె మృతదేహం ఫొటోలను పరిశీలించి నిర్ధారించారు. చిన్నతనం లోనే మతిస్థిమితం కోల్పోయి ఇంటి నుంచి వెళ్లిపోయిన సల్మా యాచిస్తూ జీవనం గడుపుతుందని తల్లి ముంతాజ్ పోలీసులకు వివరించింది.

గంజాయి ముఠా అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ జనార్దనరావు

తెనాలిరూరల్: గంజాయి విక్రయిస్తున్న ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. స్థానిక రూరల్ సర్కిల్ కార్యాలయంలో సోమవారం మధ్యాహ్నం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో నిందితుల వివరాలను డీఎస్పీ బి.జనార్దనరావు తెలిపారు. గుంటూరుకు చెందిన అందవరపు ప్రసాద్, బెల్లంకొండ గిరీష్ ప్రభుకుమార్, సీమల చంద్రశేఖర్, సిద్ధాబత్తుల వినయ్ కుమార్ నలుగురూ స్నేహితులు. వ్యసనాలకు బానిసలై సులువుగా డబ్బు సంపాదించేందుకు గంజాయి విక్రయిస్తున్నారు. విశాఖ జిల్లా నుంచి గంజాయి తీసుకు వచ్చి గుంటూరు, తెనాలి ప్రాంతాల్లో ప్యాకెట్ల చొప్పున విక్రయిస్తున్నారు. తెనాలి మండలం కొలకలూరుకు చెందిన పసుపులేటి శివమణి వీరి నుంచి గంజాయి కొంటుంటాడు. ఈ క్రమంలో శివమణి తన స్నేహితులూ గంజాయి కావాలని కోరడంతో వారికి విక్రయించేందుకు అందవరపు ప్రసాద్, బెల్లంకొండ గిరీష్ ప్రభుకుమార్, సీమల చంద్రశేఖర్ గంజాయిని మూడు బ్యాగుల్లో సర్ది తెనాలి మండలం హాఫ్‌పేట శివారు దాబా వద్దకు తీసుకు వచ్చారు. అక్కడ పోలీసులను చూసి పారిపోతుండగా శివమణితో పాటు ముగ్గురిని అదుపులోకి తీసుకుని రెండు కిలోల వంద గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. సిద్ధాబత్తుల వినయ్ కుమార్ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. నిందితులను అరెస్ట్ చేసిన సీఐ శ్రీనివాసరెడ్డి, ఎస్ఐ వెంకటేశ్వర్లును డీఎస్పీ అభినందించారు.